# దేవుని దగ్గరకు!

**వల్లూరి**

అది ఓ పెద్ద మేడ. విశాలమైన మేడ. గదులన్నీ చక్కగా అలంకరించి, పరిశుభ్రంగా, అందంగా వుంటాయ్. పేరెన్నిక గల వకీలు ఆరామమెట్లా వుంటుంది మరి? ఆ ఇల్లు ఎప్పుడూ సందడిగా వుంటుంది. నిత్య కళ్యాణం పచ్చతోరణమూను.

రోజా మాధవులకు వరుసగా ఎనిమిది, ఏడు వత్సరాలుంటాయ్. ఆ బిడ్డల మృదుచేష్టలకు, తేనె వాగులై ప్రవహించే లలితములగు మధుర పలుకులకు అమందానంద భరితు డౌతాడు వకీలు. ఆ నవనీత హృదయాలతో చిలిపి గంతులు వేస్తుందా మాతృ హృదయం.

ఆ పిల్లలు ఎప్పుడూ ఆ విశాలమైన చావిట్లో వో మూల సోఫా ప్రక్కన కూర్చుని ఆడుకొంటారు —రకరకాల బొమ్మలతోను, రంగురంగుల వస్తువుల తోను. వారు ఇతరు లెవ్వరి జోలికీ పోరు. సాధువుల్లా ఆడుకొంటారు.

గులాబీ శరీరాలూ—మల్లెపూ బట్టలూ—చిరునవ్వు పెదవులూ— చిలిపి చేష్టలూ—ప్రేమంపు చూపులూ—లలితములగు మృదువాక్కులూ—ప్రతి వానిని మురిపించి, మురిపింప చేస్తాయ్. ఎంతో ముద్దు కలుగ జేస్తాయ్. ఆనంద డోలికలలో పరుండబెట్టి వూపుతాయ్. కప్పూరపు సెత్తావులలో విహరింప జేస్తాయ్.

ప్రొద్దున్నే ఎనిమిది గంటలకు మేష్టారు వస్తారు. అంతకు పావుగంట ముందే తివాసీ అదీ పఱపించి సిద్ధంగా పుస్తకాలు ముందుపెట్టుకొని కూర్చుంటారు, ఎదురు చూస్తూ. ఎప్పటి పాఠాలు అప్పుడు కంఠస్థం చేస్తారు. మేష్టారు చెప్పిన పాఠాలు కడు శ్రద్ధగా నేర్చుకొంటారు. అంతేకాదు. మేష్టారు చెప్పే ప్రతి అంగికాభినయాన్ని కడు జాగరూకతతో గమనించి, అనుసరిస్తారు. ఆ ముద్రలు, అంతర్గత భావాల పరిశీలనాదృష్టితో అభినయిస్తారు. ఆలా ఒకరికన్నా ఒకరు నృత్యసాహిత్యములందు దినదిన ప్రవర్థమాను లౌతున్నారు. తల్లిదండ్రుల కెంత ఆల్లారు ముద్దు! ఏ తల్లిదండ్రుల హృదయాలలో ప్రేమరసం పొర్లిపోతూండదు!

ఇహ ఆ మేష్టారు హృదయం హిమానీ శిఖరాల్ని అవరోహించదూ! భావిలో ఒక వినూత్న స్థానాన్ని ఆక్రమించుకోగల ఆ మేధావులకు గురువైనప్పుడు యే మేష్టారు గర్వించడు? ఆనందాలహరిలో విహరించడు!!

మేష్టారుకి ఓ అభిలాషవుద్భవించింది. మేటి విద్యార్థులైన ఆ శిష్యుల చేత తన స్వార్జితం చేతకొనిన వస్తువు తినిపించవలెనని ఆశ. కాని దరిద్రనారాయణుడైన ఆ నిరుపేద యేమి పెట్టగలడు? తనకు తెలుసు: అటుకులు ఆ పసిపాపల పాలపండ్లు నములలేవని—అట్టి పదార్థము లెప్పుడూ వారు నోటపెట్టలేదని. అంతేకాదు—వారి తల్లితండ్రులు చూస్తే! బాపురే! ఇంకేమన్నా వుందా......

రోజు రోజుకు ఆతని ఆశాలత క్రొంగొత్త మొగ్గల్ని తొడిగింది. తనలో వుద్భవించిన ప్రేమ ప్రవాహానికి ఆనకట్ట కట్టలేక పోయాడు. ఎంతో యత్నం మీద వో నాడు తన శిష్యుల చేతుల్లో అటుకులు పెట్టగలిగాడు. అలనాడు శ్రీ కృష్ణ భగవానుని దోసిలిలో అటుకుల నిడిన కుచేలునివలె వుప్పొంగి పోయాడు.

అతడు అనుకొన్నట్టే వకీలు గారు అప్పుడే అటు వెళ్లారు. కాని అతడు భయపడినట్టు జరుగలేదు. మానవ హృదయాన్ని బాగా అర్థం చేసుకోగల ఆ నిండుమనిషి చూసీ చూడనట్టుగా వో భావగర్భితమైన చిరునవ్వు నవ్వి తన ఉదారహృదయాన్ని నిరూపించుకొన్నాడు. "దేవుడు రక్షించాడు."—మేష్టారు. హృదయం స్థిమితమైంది. కొంతసేపటికి కిటికీలోంచి తొంగి చూసే ఆతల్లి దండ్రులను—ఆనందాబ్ధి తేలియాడే హారి చిరునగవు మొగములను పరికించ గలిగాడు కూడాను. ఎంతో సంతోషించింది అతని మనస్సు.

చంద్రోదయంలో డాబామీద తల్లి వడిలో కూర్చుని సజ్జన గూళు లారగిస్తారు. మధ్య మధ్యను అటు నిటూ చిరుపరుగులు తీస్తూ తల్లి చెప్పేవిచిత్ర కథలను వింటూ నిద్రపోతారు.

అలా వారి జీవితపు టుద్యానవనం ప్రేమలతలతో; అనురాగపు చిగురులను చిలువలు పలువలుగా పెంచుకొంటూ, అందాల నిధియై వెలసిల్లింది.

కాని కాలచక్ర మెపుడూ సమతల ప్రదేశమందు నడువదుగదా! క్షణభంగురమై కన్పట్టే యీ జగతిలో. క్షణక్షణ మార్పులే రంజకత్వాన్ని చేకూరుస్తాయేమో! మానవ లోకపు ప్రత్యేకతను సూచిస్తాయేమో!! అదే కాలచక్రపు కదములోని harmony యేమో!!!

కలరా వ్యాధి కాలసర్పము వలె విషముగ్రక్కుచూ చెలరేగింది. ఆర్తనాదములతో మారుమ్రోగింది ప్రకృతంతా. ఎన్నో జీవరాసులు బలియై పోయాయ్. ఎన్నో లేత హృదయాలు మాటు మణగి పోయాయ్. ఎన్నో చిలిపి పసినవ్వులు కాలగతిలో అంతర్లీన మైపోయాయ్.

ఆ ఆనంద వనంలోని రోజా పుష్పమూ వదలిపోయింది. ఇక అది ఈ బాహ్య ప్రపంచంలో నిష్ప్రయోజనమేగా! దానివిలువ శూన్యమేగా!!

యథా ప్రకారంగా ప్రొద్దున్నే మేష్టారు వచ్చారు. నిశ్శబ్ద నిబిడీకృతంగా వుంది గృహం. మంత్రముగ్ధుడైనట్టు ప్రాంగణమున నిలబడిపోయాడు. కొయ్యబారిన అతని మెదడులో వికృతభావం చెలరేగింది. అతని దృష్టికంతా శూన్యంలా అగుపించింది. ఆ శూన్యంలో గోడుగోడున యేడ్చే మాధవుడూ—వో ప్రక్కన యేకధారగా ప్రవహించే కన్నీ రాపుకొంటూ ఆ పసిబాలుని ఓదార్చే తల్లి దండ్రులు గోచరమయ్యారు...... మేష్టారు కంటినుండి అప్రయత్నంగా అశ్రుబిందువులు రాలాయ్...!

మేష్టారు వెనుదిరిగి వెళ్ళిపోయారు అడుగుతీసి అడుగు వేసుకొంటూ.

* * *

ఒంటరి ఐపోయిన ఆబాలునిగతి నడిసంద్రములో నిరాధారపురుషుని లా వుంది. వలలో చిక్కుకున్నట్టయింది. అక్కకు దూరమైతరువాత అతని జీవితం అగమ్యగోచరమైంది. అక్కయ్య చనిపోయింది—చనిపోవడమంటే ఏమిటో? చనిపోయిన వారి భూమిమీద వుండరనుసంగతి ఆ బాలునికి తెలియదు!

అతడు వాళ్ళమ్మను అడుగుతాడు "అక్కయ్య ఏదీ??" అని ఆమె మారుపలుకకుండా ఏదో సాకు చెప్పి తప్పుకొంటుంది.

ఎన్నిరోజు లిలా?

ఉన్నకొలది మాధవుని మారాము యెక్కువైంది. ఏదో ఒకసంగతి చెప్పక తప్పిందికాదు. ఓనాడు పినతల్లివచ్చింది. ఇక ఆ అప్పచెల్లెంద్ర విచారం. రోదనచెప్ప నలవికాకపోయింది. 'రోజా' మాట వారి పెదవులనుండి వెలువడడము తరువాయి తల్లివడిలో కూర్చున్న మాధవుడు అందుకొని "అక్కయ్య ఏదమ్మా—ఎక్కడ వున్నదమ్మా—లేమ్మా—అక్కయ్యను చూపూ..." అంటూ లంకించుకొన్నాడు.

ఇహ లాభంలేదని పినతల్లి ఆతడ్ని తన వడిలోకి బలవంతంగా తీసుకుంది. "అక్కయ్యను చూపిస్తా" అంటూ భుజాన్న వేసుకొని అలా వరండాలోకి తీసుకుపోయింది. అతగాడి మారాము తగ్గించాలంటే యేదో ఒకవిషయం చెప్పి తీరాలని నిశ్చయించుకొంది. "ఇదుగో-చూచావా నాన్నా-నీవు అల్లరిచేస్తే ఎలా?—అక్కయ్య ఎంత మంచి పిల్లో. ఎప్పుడూ అల్లరిచేయదు. ఏడవదుద-అందుకనే దేవుడిదగ్గరకు వెళ్ళింది—దేవుడ్ని చూసేందుకు వెళ్ళింది ..ఎంత పుణ్యమూర్తో..."

కాని ఆమె ప్రయత్నం కేవలం కాలిన శరరాన్ని నీళ్లతో ఆర్పినట్టయింది. తానొకటి తలచిన దైవమొకటి తలచును!

"మనం ఎప్పుడు దేవుడి దగ్గరకు వెళ్తాము? ఇప్పుడే పోదాం. నాన్నను బండీ తెమ్మనీ చెప్పవూ—చెప్పూ—వూ—చెప్పూ—" అని పెంకి పట్టు పట్టాడు మాధవుడు.

"మనం వెళ్లకూడదు నాన్నా—అక్కడకు వెళ్లడం చాలాకష్టం." అన్నది ఆమె.

"పోనీలే—నేనొక్కడినీ వెళ్తాను. నన్ను వదిలేయే—వూ—దింపూ——" అని మరింత మారాము చేశాడు.

"ఛా—నీవు వెళ్ళలేవు బాబు—అక్కయ్య పుణ్యమూర్తి—ఎంతో పుణ్యం చేసుకొంది."

"మనమో—"

"మనం పాపాత్ములం—ఇలా అల్లరి చేస్తే చాలా పాపం—అక్కయ్యను తలవకుండా. ఏడవకుండా వుంటే పుణ్యం వస్తుంది." అన్నది.

"మరి నీవు ఏడుస్తున్నా వెందుకు పిన్నీ" అని రెట్టించాడు మాధవుడు.

"లయన్ బ్రాండ్"
రెడీమేడ్ దుస్తులు
మన్నికకు, దృఢమైన కుట్టునకు,
ఆకర్షణీయమైన అందానికీ పేరుబడ్డాయి
ఏజెంట్లు కావలెను
**Rukmani Readymade Manufacturing Co.,**
(High Class Readymade Dress Manufacturers)
*132—133, South Masi St.,* :: *MADURA.*

ఆమె యదాస్థితిలోనికి తేరుకొని "పోని ఎలా నాన్నా—నీవు వూరికే ఏడుస్తావు. పండుకో" మరి జోలపాడి నిద్రపుచ్చింది.

ఇదంతా తిలకిస్తూన్న వకీలు మాధవుని పక్క సర్ది పండుకోబెట్టమని సైగచేసాడు, నోటితో మాట్లాడలేక.

* * *

ఆ రోజాపుష్పం తొలగిన వెంటనే ఆ ఉద్యానవనం సౌరభమూ, ప్రకాశం మాసిపోయింది. నిరుత్సాహ వాయువులలో సన్నగిలిపోయింది. విషాద మేఘము లావరించిచాయ్........

ఆ గృహం సంస్కార విహీన మయిందనే చెప్పాలి. ఎక్కడి వస్తువులు అక్కడే చెల్లాచెదరగా పడివున్నాయ్. వీనిపాటల్లో మాంద్యత యేర్పడింది.

కత్తిగాటుపై కొరడాదెబ్బవలె—పుండుపై కారం జల్లిన విధంగా—మాధవునికి టెంపరేచరు చాలా హెచ్చుగా వుంది. అతడు మంచంలో దొర్లుతున్నాడు. ఎప్పుడూ అక్కను గురించి కలవరింతలు.

వకీలు కేసులన్నీ తనస్నేహితులకు ట్రాన్సుఫరు చేస్తూన్నాడు ఒక్కటొకటిగా. భార్య ఒక మూల భర్త ఒకమూల విచారంగా కూర్చుంటారు. ఒకరి కొకరు పొరపాటున యెదురుపడినా కన్నీటితోనే విడిపోతారు. క్షణ మొకయుగంలా రోజులు భారంగా సాగిపోతూన్నాయ్.

జై హింద్! వందేమాతరం!!

మీకు కావలసిన

- ఖాదీ
- సిల్కు వస్త్రాలను



ఇంద్రా ఖాదీ ఎంపోరియమ్‌లో

కొనండి

శుద్ధ ఖద్దరు సిల్కు తయారుచేయువారు :

: *Purchase your Silk & Khadi requirements* :

*From* : **INDRA KHADI EMPORIUM,**

**Pure Khadi & Silk Manufacturers,**

109 (Upstair) South Masi St., MADURA.

తిరిగి మేష్టారు వచ్చారు ప్రొద్దున్నే...... వెనుదిరిగి వెళ్ళిపోయారు అడుగుతీసి అడుగు వేసుకొంటూ.

అది సాయంకాలం...సంధ్యారాగము తన షికారు పూర్తిచేసుకొని వెళ్ళిపోయింది. మాయ చంద్రుడు నిండువెన్నెలలో మెరసిపోతూన్నాడు. మాధవుడ్ని ప్రక్కలో వేసుకొని పండుకొన్న దాతల్లి! మేడమీది గదిలో. గుజ్జనగూళులు లేవు—ఆ చిలిపి నవ్వులూ చిఱుపరుగులూ లేవు. ఆమె ఆలోచిస్తూ వుంది కిటికీలోకించి చంద్రుడ్నిచూస్తూ. ఒక వేళ పైసంగతులన్నీ ఒక్కటొక్కటిగా జ్ఞప్తికివస్తున్నాయేమో! — — — · —, ఆమె కండ్ల వెంబడి అశ్రుధారలు రాల్తున్నాయ్........

నిరవకాశమైన ఆకాశంలో మాట్లాడుకొంటూన్న మాధవుని పైపడ్డాయ్ రెండు కన్నీటిబిందువులు. మాధవుడు తల్లిని గట్టిగా కౌగలించుకొన్నాడు. అతడు ఏదో మాట్లాడుతూ నేవున్నాడు...

“సంధి—సంధి”—ఆమె పిచ్చిగా నవ్వింది,

“అక్కతో ఆడుకొంటూన్నావా అమ్మా—అక్క ఎక్కడ వుందమ్మా ?—”

తనకు తెలియని అవస్థలోనే ఆమె ఏదో చెప్పడం మొదలుపెట్టింది. “అదుగో చూడుబాబు. అక్కయ్య అదుగో...ఆచంద్రుడిలో వుంది. చూసావా—నవ్వుతోంది కదూ— —అదుగో అది ఇంద్రలోకం కాబోలు—అక్కడ చూశావా—మెరసిపోయే వో పెద్దసింహాసనం. దానిమీద ఎంతఠీవిగా కూర్చున్నాడో చంద్రుడు. అప్సరసలు నృత్యంచేస్తూన్నాడు. కిన్నెరకంఠాలెంత మృదువుగా, తియ్యగా వున్నాయో — వారిమధ్య, అదుగో, అక్కయ్య నృత్యంచేస్తోంది—ఎంతరమ్యంగా వుందో......”

“అమ్మా—అమ్మా” మైకంలోనే పెద్దగా అరిచాడు మాధవుడు.

వకీలు పరువెత్తివచ్చి గుమ్మంలో నుంచున్నాడు.

ఆమె చెప్పతూనేవుంది. “రోజా ఎంత ధన్యురాలో—ఎంత పుణ్యాత్మురాలో...”

అంతా నిశ్శబ్ద నిబిడీకృతం. ప్రకృతి స్తంభించిపోయిందేమో !

* * *

వకీలు హృదయంపై సమ్మెటపోట్లులా ప్రొద్దున్నే గోడగడియారం ఠంగు—ఠంగు—ఠంగు...మని ఎనిమిదిగంటలు కొట్టింది! మేష్టారు వెనుదిరిగి వెళ్ళిపోయారు అడుగుతీసి అడుగు వేసుకొంటూ—కన్నీరు తుడుచుకొంటూ.

ధాతుపుష్టియు, శక్తివర్ధకమగు

**మదనమంజరి** మాత్రలు

ధాతుక్షీణత, మలబద్ధకము, స్వప్నస్ఖలనము వీటికి ఉత్కృష్టమైన గుణమును ఇచ్చును, ఇవి రక్తమును, వీర్యమును అధికపరచ్చి దేహమునకు ఉత్సాహం కలిగించును. వెల డబ్బా రూ 1/4

కాయజ్యోతి తిల

ఈ తిలను పురుష లింగముపై రుద్దుటచే శిథిలమైన నరములకు దారుఢ్యమొసగి, వక్రత, శిధిలత మొదలగువానిని పరిహరించి శాశ్వతమైన పురుషత్వము ఏర్పరచును.

వెల రూ. 2-8-0

మదనమంజరి ఫార్మసీ

184, చైనాబజారురోడ్డు, మద్రాసు.

స్టాకిట్సు :—

ఏలూరు : రావుస్ మెడికల్ స్టోర్స్.

అనంతపురము : శ్రీ వై. శాంబయ్యగారు.

పామూరు : శక్తి మెడికల్ ఎంపోరియం.

విశాఖపట్టణము : నీలము అండు కో.